
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
ఆదివారం 25 మే 2025







గార్గేయపురం చెరువులో డ్రాగన్ బోట్ క్రీడాశిక్షణ



డ్రాగన్ బోట్

- కర్నూలులో కేరళ సంప్రదాయ క్రీడ
- గార్గేయపురం చెరువులో ట్రైనింగ్
- కొత్త క్రీడపై సర్వత్రా ఆసక్తి

కర్నూలు, మే 24 (ఆంధ్రజ్యోతి : సాధారణంగా పడవ పోటీలు అంటే ఎక్కువగా కేరళ, తమిళనాడులో చూస్తుంటాం. కానీ ఏషియన్ గేమ్స్‌లో ఉన్న పోటీల్లో డ్రాగన్ బోట్ పోటీలు కూడా ఒకటి. మన దేశంలో కేరళ రాష్ట్ర సంప్రదాయ క్రీడగా కేరళలోని చిన్న చిన్న కాల్వగట్లలో చెరువులు, అక్కడి పరిసరాల్లో ప్రవహించే నదుల్లో ఈ పడవ పోటీలను నిర్వహిస్తుంటారు. వాటిని మనం సినిమాల్లోనే చూస్తుంటాం. కానీ అదికూడా ఒక టోర్నమెంట్ అని, ఏషియన్ గేమ్స్‌లో ఒక భాగమని చాలా కొద్దిమందికే అవగాహన ఉంది. అలాంటి పోటీలను చైనా, జపాన్, టోక్యో వంటి నగరాల్లో నిర్వహించే బోటింగ్ పోటీలను డ్రాగన్ బోట్ పోటీలు అంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన డ్రాగన్ బోట్ పోటీల్లో సత్తా చాటేందుకు కర్నూలు జిల్లా క్రీడాకారులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ, ఏలూరు ప్రాంతాల్లో మాత్రమే ఈ డ్రాగన్ బోట్ పోటీలకు సంబంధించిన శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో కర్నూలు జిల్లాకు చెందిన కొంతమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు సిద్ధమయ్యారు. డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కర్నూలు శివారులోని గార్గేయపురం చెరువులో డ్రాగన్ బోట్‌పై శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర డ్రాగన్ బోట్ అసోసియేషన్ సెక్రెటరీ అవినాష్ శెట్టి రూ.3లక్షలు విలువ చేసే డ్రాగన్ బోట్‌ను ఏర్పాటు చేశారు. అందోల 10 ప్లస్ 2 పద్ధతిలో క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందుతున్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను అటాచ్‌మెంట్ పద్ధతిలో శిక్షణ ఇప్పించేందుకు ప్రత్యేకంగా నియమించారు. ప్రస్తుతం శిక్షకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాదాపు 14 నుంచి 18 మంది విద్యార్థులు గార్గేయపురం చెరువులో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఒక బోట్‌తోనే శిక్షణ ఇస్తున్నారు. మరో బోట్‌ను కూడా కేటాయిస్తే మెరుగైన శిక్షణ ఇవ్వగలమని ట్రైనర్ చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రైల్వే బ్రిడ్జిలకు భూసేకరణ పూర్తి చేయండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న రైల్వే బ్రిడ్జి ప్రాజెక్టుల నిర్మాణాలకు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితర రైల్వే ప్రాజెక్టు నిర్మాణాల పనుల పురోగతిపై కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ అక్విజేషన్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు, లేబర్ ఆఫ్ యాక్సెప్టెన్స్‌ల అంశంపై వెంటనే చర్యలు తీసుకుని పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో మూడు రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ మాట్లాడుతూ పత్తికొండ డివిజన్‌లో జరుగుతున్న రెండు ప్రాజెక్టులకు డబుల్ ట్రాక్ కోసం జరుగుతున్న పనికి ల్యాండ్ అక్విజేషన్ పూర్తయిందని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌బాబు, ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ దుర్గారావు, ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గానికి ఒక స్టేడియం

- నగరంలో క్రికెట్ స్టేడియం అభివృద్ధికి చర్యలు
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ/ స్పోర్ట్స్, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గంలో స్టేడియం ఏర్పాటు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, కర్నూలు నగరంలో క్రికెట్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం కర్నూలు మండల మునగాల పాడు గ్రామం బాల సాయిబాబ పాఠశాల పక్కన ఉన్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ మైదానాన్ని మంత్రి టీజీ భరత్‌తో పాటు విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్‌బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా మైదానం విస్తర్ణం, లెవెలింగ్, ఫెన్సింగ్ పనుల పురోగతి గురించి అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మంచి ఆర్కిటెక్‌తో, తగిన సౌకర్యాలతో, మంచి డిజైన్లతో స్టేడియంను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏసీఏ ప్రతినిధులకు మంత్రి సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని మాట్లాడుతూ గ్రౌండ్ ప్రణాళికను జూన్ 7 నాటికి రూపొందించాలన్నారు. అనంతరం అభివృద్ధి పనులు ప్రారంభించి, త్వరగా మైదానం నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో స్టేడియం నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పడం ఆనందంగా ఉందన్నారు.

- అనంతరం మంత్రి, కలెక్టర్ సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలించారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి శ్రీనివాస్, కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీవో సందీప్, తహసీల్దారు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మంత్రి, విజయవాడ ఎంపీ, కర్నూలు ఎంపీ, కలెక్టర్


కేరళను తాకిన నైరుతి రుతు పవనాలు

- 16 ఏళ్ల తర్వాత మొదటిసారిగా ముందస్తు వానలు
- పొలం పనుల్లో రైతులు బిజీ బిజీ



కర్నూలు అగ్రికల్చర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు చేయడానికి ముఖ్యమైన నైరుతి రుతుపవనాలు 12 రోజుల ముందుగానే శనివారం కేరళలో ప్రవేశించాయి. రెండు రోజుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో నైరుతి రుతుపవనాలు వస్తాయని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. 16 ఏళ్ల తర్వాత నైరుతి రుతుపవనాలు అంచనాలకంటే ముందుగానే ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. 2001, 2009లో రుతుపవనాలు అనుకున్న సమయం కంటే ముందుగానే కేరళలోకి ప్రవేశించాయి. ఆ రెండేళ్లలో మే 23నే కేరళను తాకాయి. రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కూడా మే నెలాఖరులో రుతుపవనాలు ప్రవేశించి ముందస్తు వర్షాలు కురవడం వల్ల పంటలు క్రిమికీటకాలు, వాతావరణ పరిస్థితులను తట్టుకుని మంచి దిగుబడులు వచ్చాయని రైతులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గత సంవత్సరం ఖరీఫ్‌లో పత్తి ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చిందని, అదే పరిస్థితి ఈ సంవత్సరం కూడా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. గత సంవత్సరం కర్నూలు జిల్లాలో సాధారణ వర్షపాతం 614.7 ఎంఎం కాగా, 605 ఎంఎం నమోదైంది. నంద్యాల జిల్లాలో 559.4 ఎంఎం వర్షపాతానికిగాను 726.4 ఎంఎం నమోదైంది. 30 శాతం అధికంగా ఆ జిల్లాలో నమోదైంది. ఈ ఏడాది రెండు జిల్లాలో కలిపి ఖరీఫ్‌లో 6.40 హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ప్రధానంగా రాష్ట్రంలోనే అత్యధికంగా పత్తి ఈసారి 2.50 లక్షల హెక్టార్లలో సాగవుతుందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

నిర్మాణ దశలో ఎమ్మిగనూరు లే అవుట్



పీఎంఏవై.. పూర్‌గతి

- మందకొడిగా గృహ నిర్మాణ పనులు
- జిల్లా వ్యాప్తంగా 39,003 ఇళ్లు మంజూరు
- క్షేత్రస్థాయిలో అసంపూర్తిగా 15,191 ఇళ్లు
- అత్యధిక శాతం పునాదులకే పరిమితం..
- లక్ష్య సాధనలో ఎమ్మిగనూరు ఫస్ట్.. ఆలూరు లాస్ట్
- వేధిస్తోన్న సిబ్బంది కొరత

పేదోడి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' (పీఎంఏవై) పథకం కొనసాగుతోంది. జిల్లాలో పీఎంఎవై పనుల్లో పురోగతి అంతంత మాత్రమే అని చెప్పవచ్చు. నిధుల పుష్కలంగా ఉన్నా క్షేత్రస్థాయిలో మాత్రం ప్రగతి కనబడటం లేదు. అధికారిక లెక్కలు ఒకటి చెబుతుండగా వాస్తవాలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ పథకం అధోగతి చేరింది. దీనికి తోడు సిబ్బంది కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది. అయినప్పటికీ జిల్లా హౌసింగ్ శాఖ అధికారులు మాత్రం ఎలాగైనా లక్ష్యానికి చేరి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. వారి శ్రమ ఫలిస్తుందో లేదో వేచి చూడాల్సిందే..

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో పురోగతి లేకుండా పోయింది. గృహనిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల లభ్యత పుష్కలంగా ఉన్నా వాటి నిర్మాణ పనులే ఆశించిన స్థాయిలో ముందుకు సాగటంలేదు. నిర్దేశిత లక్ష్యానికి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితికి పొంతన లేకుండాపోయింది. ప్రభుత్వాలు మారినా, పథకం పేర్లు మార్చిన గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గృహనిర్మాణ ప్రగతి అధోగతికి చేరిందనే చెప్పాలి.

నత్తనడకన..

కర్నూలు జిల్లావ్యాప్తంగా 39,003 ఇళ్లు మంజూరు కాగా, నేటికీ 38981 ఇళ్లు పూర్తయినట్లు కాగితపు లెక్కలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఇంకా 15,191 ఇళ్లు వివిధస్థాయిలో అసంపూర్తిగా నిలిచాయి. 22మంది లబ్ధిదారులైతే ఏదశలోనూ నిర్మాణ పనులను ప్రారంభించ లేదంటే అతిశయోక్తి కాదు. అత్యధిక శాతం ఇళ్లు పునాది స్థాయిలోనే నిలిచిపోయాయి. అధికశాతం నిధులు పునాది పనులకు కేటాయిస్తుండటంతో 7698 మంది లబ్ధిదారులు వాటిని తీసుకుని అక్కడితోనే పనులు నిలిపేయ టం గమనార్హం. జిల్లావ్యాప్తంగా గృహ నిర్మాణ పనులు 61 శాతం లక్ష్యాన్ని చేరుకోగా, కర్నూలు డివిజన్ 73శాతం, ఆదోని 58, పత్తికొండ 52 శాతం పురోగతిని సాధించింది. నియోజకవర్గాల వారీగా చూస్తే కోడుమూరు 77 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, అలూరు 49 శాతం లక్ష్యాన్ని సాధించి అట్టడుగున నిలిచింది. మండలాలవారీ లక్ష్య సాధనలో ఎమ్మిగనూరు అర్బన్ 93 శాతంతో ప్రథమ స్థానంలో నిలువగా ఆలూరు మండలం 30 శాతంతో చివరి స్థానానికి పరిమితమైంది.

ఇంజనీర్ల స్థానాలు ఖాళీగా

క్షేత్రస్థాయి పనుల పర్యవేక్షణలో కీలకమైన ఇంజనీర్ల స్థానాలు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్లకు గాను ముగ్గురు కార్యానిర్వాహక ఇంజనీర్లు ఉండాల్సి ఉండగా, ఒకే ఒక్కస్థానం పూర్తిస్థాయిలో భర్తీ అయింది. ఈయన కూడా ఈనెలాఖారుకు పదవీ విరమణ చేయనుండటం గమనార్హం. నియోజకవర్గానికి ఒకరు చొప్పున 7 మంది ఉప ఇంజనీర్లు విధులు నిర్వర్తించాల్సి ఉండగా, ముగ్గురు మాత్రమే శాశ్వత ఉప ఇంజనీర్లు ఉన్నారు. వీరిలో ఒకరు అనారోగ్య కారణాలతో సెలవులో ఉండగా, అందుబాటులో ఉన్న ఇద్దరు డీఈలు స్థానాలతో పాటు కార్యానిర్వాహక ఇంజనీర్లుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అర్బన్ ప్రాంతంతో కలిపి మండలానికో సహాయ ఇంజనీరు చొప్పున 29 మంది అవసరం కాగా, కేవలం ఆరు మంది మాత్రమే శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్నారు. మిగతా స్థానాల్లో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తు న్నారు. కొందరు సహాయ ఇంజనీర్లు, తమ విధులతో పాటు ఉప ఇంజనీర్లుగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సిబ్బంది కొరతతో అందుబాటులో ఉన్న ఉద్యోగులకే అదనపు బాధ్యతలు అప్పగించటంతో పనిభారంతో వారు తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారు.

జూన్ 12 లోపు..



టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న తరుణంలో జిల్లాలో 11,706 గృహాలను పూర్తి చేయాలని లక్ష్యాన్ని విధించగా, నగటున రోజుకు 25 ఇళ్లు చొప్పున 6676 పూర్తి కాగా, మరో 5030 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల పరిధిలో కర్నూలు జిల్లా 58శాతం పురోగతితో నాల్గవ స్థానంలో నిలవటం హర్షించదగ్గ విషయం. జూన్ 12లోపు ఈలక్ష్యాన్ని చేదించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

ఆశించిన ఫలితం రావటం లేదు..

గృహ నిర్మాణ పనులు మందకొడిగా సాగటానికి కారణాలు అనేకం. పనుల పురోగతిపై ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందితో సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యట నలు, సిబ్బందికి తాఖీదులు, లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆశించిన స్థాయిలో ఫలితం కానరావటం లేదు. లబ్ధిదారులను ప్రోత్సాహించి, వారిని గృహ యజమానిచేసి పథకాన్ని విజయవంతం చేయాలనే సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభు త్వం అదనంగా ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. పలు విభాగాల వారీగా వెనకబడిన కులాలకు రూ.50వేలు, షెడ్యూల్ కులాలు, తెగలకు రూ.75 వేలు, చెంచులకు రూ.లక్ష అదనంగా నిధులను మంజూరు చేస్తోంది. అయిన కూడా లబ్ధిదారులో సానుకూల స్పందన రావటం లేదు. వాస్తవానికి ఈ సమస్య పశ్చిమ ప్రాంతంలో అధికంగా అగుపిస్తోంది. ఆదోని, ఆలూరు ప్రాంతాల్లో అయితే వలస కార్మికులు, రోజు వారీ కూలీలు, జీవనోపాధి కోసం పొట్టచేత పట్టుకుని దూర ప్రాంతాలకు వెళ్లటం, వలసల అనంతరం సొంతూరుకు చేరిన తరువాత ఇంటి నిర్మాణాన్ని చేపడుదామనే చిన్న పాటి నిర్లిప్తతతోనూ ఈ గృహనిర్మాణ పనులు ముందుకు సాగటం లేదు. ఇప్పటికే ఈ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.531 కోట్లు నిధులు ఖర్చుచేసింది. కానీ జగన్ సర్కారు ఇళ్లు కాదు ఊర్లు అంటూ ఊదరగొట్టినా, కాలనీల్లో మాత్రం కనీస వసతులను విస్మరించింది. ఈ కారణంతోనే పూర్తయిన ఇళ్లలో చేరేందుకు లబ్ధిదారులు నిరాసక్తత చూపుతున్నారు.

ప్రథమ స్థానానికి కృషి..



గృహ నిర్మాణ పనులకు ముందుకు రాని లబ్ధిదారులను కలిసి పథకం ప్రయోజనాలు, ప్రభుత్వపరంగా వారికి అందే సహకారం తదితర వాటిని వివరిస్తున్నాం. స్పందన లేని లబ్ధిదారులకు తాఖీదులు ఇవ్వటం, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. నిర్దేశిత గడువులోపు జిల్లాను ప్రథమ స్థానానికి తీసుకు వెళ్లాలనే సంకల్పంతో సమష్టిగా పనిచేస్తున్నాం.

-టి.చిరంజీవి,
జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

అర్జీల పరిష్కారానికి 1100కు ఫోన్ చేయవచ్చు

అధికారులు తమ దరఖాస్తులోని సమస్య పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో ఓ మోస్తరు వర్షం

నంద్యాల ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో ఆదివారం ఉరుములు, పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ శనివారం వెల్లడించింది. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవకాశముందని, అనేక ప్రదేశాల్లో 15.6ఎంఎం నుంచి 64.4 ఎంఎం వర్షం పడే సూచనలున్నాయని తెలిపారు. అందులో ప్రధానంగా కర్నూలు జిల్లాలో ఆదోని, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, కోసిగి, కౌతాళం, మద్దికెర, మంత్రాలయం, పత్తికొండ, పెద్దకడుబూరు, తుగ్గలి మండలాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. అలాగే నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి తదితర మండలాల్లో కూడా వర్షాలు కురుస్తాయని తెలిపారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన



గొంతుకు ఉరి తాడు వేసుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

గూడూరు, మే 24(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీర్ కార్మికులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. శనివారం గూడూరు పాత బస్టాండ్‌లో కార్మికులు గొంతుకు ఉరి తాడు వేసుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మాట్లాడుతూ టెక్నికల్ జీతం రూ.29,200, నాన్ టెక్నికల్ జీతం రూ.24,500 ఇవ్వాలని, 15 సంవత్సరాలు పైబడిన వారిని రెగ్యులర్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అరవింద్, దూకేశ్వరరావు, బసవరాజు, మధు, ఆంజనేయులు, హుసేన్ ఖాన్, షబ్బీర్, జయన్న. ఖాజాహుసేన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

విష్ణు నాయకత్వంలో పార్టీ బలోపేతం

టీడీపీ నాయకుడు రవీంద్రగౌడ్



మాట్లాడుతున్న రవీంద్రగౌడ్

కోడుమూరు, మే 24(ఆంధ్రజ్యోతి): కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ బలోపేతమైందని, దాని వలన 2024 ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిందని టీడీపీ నాయకుడు రవీంద్రగౌడ్ అన్నారు. టీడీపీలో తమకు అవమానం జరుగుతుందని కోట్ల వర్గీయులు ఆరోపణలను ఖండిస్తూ స్థానిక నీటి పారుదలశాఖ విశ్రాంతి భవనంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవీంద్రగౌడ్ మాట్లాడుతూ గతంలో టీడీపీకి చెందిన తనపై వైసీపీ నాయకులు దాడి చేస్తే కనీసం ప్రశ్నించకుండా టీడీపీ నాయకులు ఇంట్లో దాక్కొన్నారని అన్నారు. తనపై దాడి జరిగిన విషయాన్ని తెలుసుకొన్న విష్ణువర్ధన్‌రెడ్డి తనకు అండగా నిలిచారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రచారానికి దూరంగా ఉన్న కోట్ల వర్గీయులు ఈ రోజు పార్టీ తమను గుర్తించడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీపై ఆరోపణలు మానుకొని ఇప్పటికైన పార్టీ కోసం పని చేయాలని హితవుపలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు, బడెసాగౌడ్, గంగాధర్ నాయుడు, బలరాం, బ్రిటీష్ రాముడు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు స్కానింగ్‌కు రెఫర్ చేయరాదు

కర్నూలు హాస్పిటల్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్లు (ఆర్‌ఎంపీ)లు గర్భిణులను అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం రెఫర్ చేయరాదని డీఎంహెచ్‌వో పి.శాంతికళ శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. గర్భిణుల్లో పిండం పెరుగుదల, జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యం తదితర వాటిని గుర్తించుటకు అర్హత కలిగిన వైద్యులు మాత్రమే స్కానింగ్ చేయవచ్చునన్నారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం పొందడం వల్ల మాతాశిశు మరణాలు జరగకుండా నియంత్రించవచ్చునన్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ వద్ద రిజిస్ట్రేషన్ లేని ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఫెర్టిలిటి కేంద్రాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

27న సీపీఐ జిల్లా సమితి సమావేశం

కర్నూలు న్యూసిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా సమితి సమావేశం ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్ భవన్‌లో జరిగే సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పి.రామచంద్రయ్య హాజరవుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్న జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రీవెరిఫికేషన్‌లో పెరిగిన మార్కులు

సి.బెళగల్, మే 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి రీవెరిఫికేషన్‌లో సంగాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రేమవర్ణకు 535 మార్కులు తక్కువ వచ్చాయని, సోషల్ సబ్జెక్టును రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేయగా అదనంగా 16 మార్కులు కలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు సువర్ణ, సుధాకర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష స్పాట్ వాల్యుయేషన్‌లో దిద్దే ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వలన మార్కులు తక్కువ వచ్చాయన్నారు.

'హలో బీసీ.. చలో ప్రొద్దుటూరు' జయప్రదం చేయండి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 24(ఆంధ్రజ్యోతి): హలో బీసీ, చలో ప్రొద్దుటూరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వై.ఎస్.ఆర్. కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 26న ప్రొద్దుటూరులో జరిగే సభకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హాజరవుతున్నారన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, కేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్‌లో 16 మంది డిబార్

కర్నూలు అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 2,6 సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 2వ సెమిస్టర్లో 10,775 మందికిగాను 9,616 మంది హాజరయ్యారు. అదేవిధంగా 6వ సెమిస్టర్‌కు 207 మందికిగాను 185 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల్లో 16 మంది మాస్ కాపియింగ్‌కు పాల్పడగా డిబార్ చేశామని వర్సిటీ అధికారులు తెలిపారు.

కల్లూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
● అర్బన్ 16 వార్డులపై సమీక్ష

కల్లూరు, మే 24(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ సమావేశ భవన్‌లో కమిషనర్ ఎస్.రవీంద్రబాబుతో కలిసి కల్లూరు అర్బన్ వార్డుల అభి వృద్ధిపై ఎమ్మెల్యే సమీక్షించారు. ముందుగా వార్డుల వారీగా అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం వార్డుల్లో నెలకొన్న స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే చర్చించారు. గౌరు చరిత మాట్లాడుతూ కల్లూరు అర్బన్ వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.187 కోట్లు నిధులు మంజూరు చేసిందని, జగన్నాథగట్టుపై 50 ఎంఎల్‌డి నీటిశుద్ధి కేంద్రానికి రూ.115 కోట్లు, పుచ్చలపల్లి సుందరయ్యపార్క్‌లో 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి రూ.22 కోట్లు, కల్లూరు అర్బన్ వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.50 కోట్లను సీఎం కేటాయించా రన్నారు. తాగునీటి సమస్య సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశం అనంతరం 20వ వార్డు బద్రినాథ్‌నగర్‌లో రూ.50లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే గౌరు చరిత, కమిషనర్ రవీంద్రబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి కల్లూరు అర్బన్ 16 వార్డుల టీడీపీ నాయకులు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

మహానాడును విజయవంతం చేయండి : గౌరు దంపతులు

కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో తలపెట్టిన మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహానాడు నియోజకవర్గ అబ్జర్వర్ పొలంరెడ్డి దినేష్‌రెడ్డితో కలిసి పాణ్యం నియోజకవర్గంలోని 16 వార్డుల ఇన్‌చార్జిలు, కస్టర్ ఇన్‌చార్జిలు, కల్లూరు, ఓర్వకల్లు, పాణ్యం గడివేముల మండలాల అధ్యక్షులతో గౌరు దంపతులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా కడపలో నిర్వహించనున్న మహానాడుకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయ కుడు గౌరు జనార్ధన్‌రెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ ఆదేన్న, నాలుగు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మాస్టర్ ట్రైనర్స్‌కి ఓరియంటేషన్ శిక్షణ

● 256 మందికి శిక్షణ
● జాయింట్ కలెక్టర్ నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య



యోగాసనాలు చేస్తున్న దృశ్యం

కర్నూలు స్పోర్ట్స్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో 256 మంది యోగా ట్రైనర్స్‌కు ఓరియంటేషన్ శిక్షణ ఇస్తామని జాయింట్ కలెక్టర్ బి.నవ్య తెలిపారు. శనివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర-2025, యోగా సాధన, అవగాహన మాసోత్సవం సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్‌కి ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు రెండు కోట్ల మంది యోగా నేర్చుకుని కార్యక్రమంలో పాల్గొనేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని మండల స్థాయిలోని ట్రైనర్స్‌కు ట్రైనింగ్ ఇచ్చేందుకు ఇండోర్ స్టేడియం, అవుట్‌డోర్ స్టేడియంలో 256 మంది మాస్టర్ ట్రైనర్స్‌కు రెండు రోజులపాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం శనివారం ఉదయం మురళీదేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా వారి ప్రత్యక్ష ప్రసారం ద్వారా మొదలవుతుందని అన్నారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్ పాల్, సెట్కూరు సీఈవో డా. వేణుగోపాల్, డీఎస్‌డీవో భూపతిరావు, డీపీవో శ్రీనివాసులు, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాశ్ శెట్టి, యోగాచార్యులు ప్రసాద్, విజయ్ కుమార్, మునిస్వామి, మెడికల్ ఆఫీసర్లు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఓర్వకల్లు, మే 24(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉపాధి బిల్లులు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న కోరారు. శనివారం మండలంలోని గుట్టపాడు, ఎన్.కొంతలపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పను లను ఆయన పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

కర్నూలు స్పోర్ట్స్, మే 24(ఆంధ్రజ్యోతి): జోహరాపురంలోని క్రీడా మైదానంలో కబడ్డీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. శనివారం కబడ్డీ క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారుడు విద్యాసాగర్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. సీనియర్ క్రీడాకారులు పి.రాజశఖర్, వెంకటేశ్వర్లు, ఆనంద్, కృష్ణ, మురళి, సోలోమాన్, ఎస్ఐ ఓబులేసు పాల్గొన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఓర్వకల్లు, మే 24 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈగల్ టీమ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని గుట్టపాడు గ్రామ సమీపంలో ఉన్న జయరాజ్ ఇస్పాత్ (ఉక్కు పరిశ్రమ)లో పని చేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలకు గంజాయి దుష్ప్రబావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉత్తర్ ప్రదేశ్, బీహార్, రాజస్థాన్ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన కూలీలకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఉక్కు పరిశ్రమ జూనియర్ హెచ్ఆర్ మంజునాథ్, అరవింద్, సతీష్, శనల్క, రాఘవేంద్ర, కిషోర్ పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టం అమలు చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్, మే 24(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో గోవధ నిషేధ చట్టం అమలు చేయాలని, అలాగే అక్రమ గోరవాణాపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీసీ మద్దిలేటి, ఈపూరి నాగరాజు కలెక్టర్ పి. రంజిత్‌బాషాను కోరారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా లో గోవుల అక్రమ రవాణా జరుగుతోందని, దీని నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గోవధ నిషేధ చట్టం అమలు చేయా లని కోరుతూ ఎస్పీ, రవాణాశాఖ డీసీ, డీఎస్పీ, జిల్లా పశువైద్యాధికారి, జిల్లా ఆహార భద్రత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నేతలు నీలి నరసింహ, బెస్త పరశు రాముడు, గోవిందరాజులు, గూడూరు గిరిబాబు, తిమ్మారెడ్డి, సాయి నాథ్, కరణం సుధాకర్, రాజేంద్రప్రసాద్, చైతన్య పాల్గొన్నారు.

చౌకదుకాణాల్లోనే రేషన్ తీసుకోవాలి: ఆర్డీవో

కర్నూలు రూరల్ మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇక నుంచి చౌకదుకాణాల్లోనే ప్రజలు రేషన్ తీసుకోవాలని కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి కిడారి సందీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ నెల ఒకటో తేదీ నుంచి ఎఫ్‌పీ షాపు దుకాణాల ద్వారా ప్రభుత్వం నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తాం దన్నారు. ఉద యం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి రాత్రి 8గంటల వరకు నిత్యావసర సరుకులు తీసుకోవచ్చునని తెలిపారు. 65ఏళ్ల పైబడిన, విభిన్న వైకల్యం, దృష్టి లోపం ఉన్న కార్డుదారులకు మాత్రమే నిత్యావసర సరుకులు డోర్ డెలివరి చేస్తారని ఆయన వివరించారు. అంతేకాకుండా పోర్టబిలిటి సౌకర్యం అమల్లో ఉన్నందున రేషన్ కార్డుదారుడు ఎక్కడైన సరుకులు తీసుకోవచ్చునని ఆర్డీవో ప్రజలకు సూచించారు.

బదిలీల పాయింట్స్‌పై సీలింగ్ ఎత్తివేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 24(ఆంధ్రజ్యోతి): 2025 ఉపాధ్యాయ బదిలీల స్టేషన్ పాయింట్స్‌పై ఉన్న సిలింగ్‌ను ఎత్తివేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రంగన్న, సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ 2014 డీఎస్సీ ఉపాధ్యాయులు సుమారు తొమ్మిది సంవత్సరాలుగా కౌతాళం, కోసిగి, హోళగుంద మండలాల్లో ఉద్యోగం చేసి 9 ఏళ్లు పూర్తి చేసుకుని 2025 బదిలీల్లో అప్లయ్ చేసుకుంటే స్టేషన్ పాయింట్లు 8 సంవత్సరాలకే కేటాయిచండం ద్వారా జూనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందన్నారు. కాబట్టి పాఠశాలల్లో పనిచేసిన సంవత్సరాలన్నింటికి పాయింట్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈవిషయాన్ని డీఈవో శ్యాముల్ పాల్ దృష్టికి ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో కౌతాళం, కోసిగి మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కర్నూలు ఎడ్యుకేషన్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పెద్దపాడు రోడ్డులోని ఏపీ ఆదర్శ పాఠశాల పక్కనే నిర్మాణంలో ఉన్న భీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు కె.వెంకట రమణ రూ.25వేలు, కె.శ్రీనివాసులు రూ.25వేలు నగదును జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న సమక్షంలో శనివారం అందజేశారు. కురువ సంఘం నాయకుడు ఎంకే రంగస్వామి మాట్లాడుతూ ఆలయ నిర్మాణం, కమ్యూ నిటీ హాలు, విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలను ఇవ్వాలని కోరారు. దాతలను శాలువతో సన్మానించారు.

మత సామరస్యానికి భారతదేశం ఒక గొప్ప ప్రతీక



'రక్త తర్పణం' నాటికలోని ఒక సన్నివేశం

కర్నూలు కల్చరల్, మే 24(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి భారతదేశం ఒక గొప్ప ప్రతీక అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో దివంగత తాళ్లూరి ప్రసాదరావు 70వ జయంతి సందర్భంగా జాన్‌సన్ రూపొందించిన 'రక్తతర్పణం' నాటిక ప్రదర్శన, క్రైస్తవ భక్తి గీతాల ఆలపాన కార్యక్రమాలను ప్రదర్శిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిరాశాంతి మాట్లాడుతూ దేశంలో అందరూ కలిసి మెలిసి వసుదైక కుటుంబంలా జీవించి నప్పుడు శాంతి సౌభాతృత్వాలు వెల్లివిరుస్తా యని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ తాను ఒక క్రైస్తవ సంస్థ పరిధిలోని కళాశాల్లో 30 ఏళ్ల అధ్యాపకునిగా పని చేయడం మరిచిపోలేని విషయమన్నారు. తాను రచించిన ఏసు శతకం ఇప్పటికీ ఆదరణ పొందుతోదని గుర్తు చేశారు. అనంతరం ప్రదర్శించిన రత్త తర్పణం నాటిక, క్రైస్తవ భక్తిగీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గజల్ గాయకుడు మహమ్మద్ మియా వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

కిలాకరి మెసెజ్ విధానంపై అవగాహన

కర్నూలు హాస్పిటల్, మే 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎర్రబురుజు పరిధిలోని 3వ సచివాలయం చిందరరావు వీధిలో కిలాకరి మెసెజ్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివా సులుశెట్టి మాట్లాడుతూ కిల్కారి, మొబైల్ మెసెజ్ విధానం ద్వారా మాతాశిశు ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందన్నారు. గర్భం దాల్చిన నాల్గవ నెల నుంచి బిడ్డకు ఒక సంవత్సరం వయస్సు వచ్చే వరకు మెసెజ్ ఇస్తారన్నారు. గర్భిణులు, కొత్త తల్లులు, వారి కుటుంబాల్లో జ్ఞానాన్ని, అవగాహన పెంచడమే లక్ష్యంగా 72 వారాలు వాయిస్ మెసెజ్ 01244451660 నెంబరు నుంచి వస్తాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్యకార్యకర్తలు నేషావతి, కవిత, రామేశ్వరి, గర్భిణులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యలు పరిష్కారం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, మే 24(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న పరిశ్రమలను ప్రోత్సహించటంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఏపీఎంఎస్ఈఎఫ్ఎస్ రీజినల్ కౌన్సిల్ చైర్మన్ చాంద్‌బాషా అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిశ్రమల కేంద్రంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చాంద్‌బాషా మాట్లాడుతూ సరఫరాదారు, కొనుగోలుదారు మధ్య సమన్వయం, సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు. కొనుగోలుదారులు వస్తువులను దిగుమతి లేదా స్వాధీనం చేసుకున్నా తరువాత వాటికి సంబంధించిన బిల్లులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సొమ్ములు చెల్లించడంలో జాప్యం జరిగితే సరఫరాదారులు ఆర్థికంగా నష్టపోతారని, దీంతో సూక్ష్మ, చిన్న పరిశ్రమలు ప్రారంభంలోనే ఆర్థిక ఒడిదుడుకులతో కుదేలు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్ర జీఎం అరుణ, ఆరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నేతల డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు

కర్నూలు కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, ఇతర ఆదివాసీ మావోయిస్టు నాయకుల ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎన్‌కౌంటర్ హత్యలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహిం చారు. వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించిన ఈకార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు భార్గవ నిరసన ప్రదర్శనను ప్రారంభించారు. విరసం రాష్ట్ర నాయకుడు పాణి మాట్లాడుతూ శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించి, మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిని హత్యచేయడం దుర్మార్గమని, కేంద్ర ప్రభుత్వానికి కనీస మానవీయ విలువలు కూడా లేవని, పెద్దఎత్తున ప్రజాస్వామిక వాదులు ఈహత్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. పౌర హక్కుల సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి అల్లా బకాష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్‌కౌంటర్‌లో చనిపోయినవారి శవాలను కూడా బంధు వులకు అప్పగించడం లేదని, ఇది అంతర్జాతీయ పౌర హక్కుల ఉల్లంఘన అని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఈ హత్యలు చేయిస్తున్నాయన్నారు. ఈనిరసనలో ఎస్‌డీపీఐ నాయకుడు చాంద్ బాషా, పీడీఎస్‌యూ నాయకుడు రమణ, రాయలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీ నర్ భాస్కరరెడ్డి, ప్రజాఅభ్యుదయ సంస్థ నాయకులు శ్రీనివాసరావు, యోహాను, కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు సుబ్బరాయుడు, విద్యావంతుల వేదిక సభ్యుడు రత్తనం ఏసేపు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

గూడూరు మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3, 6, 9, 10 రేషన్ షాపులను తహసీల్దార్ రామాంజనేయులు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు కార్డుదారులకు అందిస్తామన్నారు.

రుణాలను వినియోగించుకోవాలి

సి.బెళగల్, మే 24(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వెలుగు ఏపీఎం రమేష్ అన్నారు. శనివారం మండల వెలుగు కార్యాలయంలో బుక్ కీపర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

యోగాతో మానసిక ప్రశాంతత: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. యోగా మాసోత్సవంలో భాగంగా శనివారం ఖానా-ఖజానా వద్ద స్ట్రీట్ యోగా కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలంతా యోగాను రోజువారి దినచర్యలో అలవాటుగా మార్చుకోవాలన్నారు. నగర పాలక ఆధ్వర్యంలో వచ్చే నెల 21 వరకు ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగా ఆసనాలపై శిక్షణ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యోగా సంఘం కార్యదర్శి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు నిర్వహిస్తున్న సర్వేను వేగవంతం చేయాలని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ అన్నారు. శనివారం కౌన్సిల్ సమావేశ భవనంలో సచివాలయ అడ్మిన్‌లతో సమావేశం నిర్వహించారు. అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ యోగాలో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్న వారి వివరాలను త్వరగా సర్వే చేసి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు.



యోగా చేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు, చిన్నారులు

యోగాను విజయవంతం చేయండి

ఓర్వకల్లు: ఈనెల 26న నిర్వహించే యోగాను విజయవంతం చేయాలని డ్వామా పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ రమణయ్య అధికారులకు ఆదేశించారు. శనివారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో యోగాపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రమణయ్య మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటలకు రాక్ గార్డెన్‌లో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి పొదుపు సంఘాలు, రైతులు, విద్యార్థులు, అంగన్ వాడీలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొనేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఏపీ టూరిజం కమిషనర్ అజయ్ జైన్, కలెక్టర్ రంజిత్‌బాషా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ రామయ్య పాల్గొన్నారు.



ఓర్వకల్లులో మాట్లాడుతున్న డ్వామా పీడీ రమణయ్య


యోగాతోనే ఆరోగ్యం: ఉపకులపతి

కర్నూలు అర్బన్: యోగాతోనే ఆరోగ్యం లభిస్తుందని ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ఉపకులపతి ముఖ్య అతిథిగా ముఖ్య హాజరై మాట్లాడారు. యోగా శిక్షకులు బి. శ్రీనివాసులు, యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, యోగా కోర్డినేటర్లు డాక్టర్ బి.కవిత, ఫిజికల్ డైరెక్టర్ పి.శివకిషోర్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

థైరాయిడిజంకు

- ఆందోళనలో థైరాయిడ్ బాధితులు
- రోజురోజుకు పెరుగుతున్న కేసులు
- పురుషుల కంటే మహిళల్లో అధికం
- జీవనశైలి మార్పుతో నియంత్రించొచ్చు
- నేడు వరల్డ్ థైరాయిడ్ డే

కర్నూలు హాస్పిటల్, మే 24 (ఆంధ్రజ్యోతి): జుట్టు రాలడం, బరువు తగ్గడం, ఇతర అనారోగ్యాలు, వంటి సమస్యలతో థైరాయిడ్ రోగులు భయపడిపోతున్నారు. ముఖ్యంగా ఇప్పుడు చాలా మంది మహిళల్లో వేధిస్తున్న సమస్య థైరాయిడ్. ఆహారం, వ్యాయామాల్లో కొన్ని మార్పులు చేసుకుంటే ఈ వ్యాధిని అరికట్టవచ్చునని వైద్యులు తెలియజేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 20 కోట్ల మంది థైరాయిడ్ వ్యాధితో బాధపడుతున్నారు. థైరాయిడ్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 2007 మే 25వ తేదీన ప్రపంచ థైరాయిడ్ వ్యాధుల నివారణ-ప్రారంభ చికిత్స అన్న నినాదాన్ని ఇచ్చింది.



అవయవాల పనితీరు మందగిస్తుంది..

మన శరీరంలో అన్నిభాగాలు సక్రమంగా పనిచేయాలంటే థైరాయిడ్ గ్రంధి పని తీరు బాగా ఉండాలి. ఈగ్రంధి పనితీరులో ఏమాత్రం తేడా కనిపించినా అవయవాల పనితీరు మందగిస్తుంది. శరీరంలో ఉన్న ముఖ్య గ్రంథుల్లో థైరాయిడ్ ఒకటి. ఇది శరీర ఎదుగుదలలో ప్రధానపాత్ర పోషిస్తుంది. అయితే ఈగ్రంధి పనితీరు గతి తప్పుతుంది. దీంతో హైపర్, హైపో థైరాయిడిజం, గాయిటల్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ గ్రంధి సమతుల్యత తప్పడంతో ఒక్కసారి థైరాయిడ్ క్యాన్సర్ బారిన పడుతారు.

లక్షణాలు:

- కొన్ని శారీరక లక్షణాలతో థైరాయిడ్‌ను గుర్తించవచ్చును. ఆకలి లేకపోవడం, బరువు పెరగడం, త్వరగా అలసిపోవడం, మలబద్దకం, నెలసరి క్రమం తప్పడం, జుట్టు విపరీతంగా రాలడం, చర్మం పొడిగా మారడం, చలికి తట్టుకోలేక పోవడం వంటివి కనిపిస్తే దాన్ని హైపో థైరాయిడిజంగా గుర్తించాలి.
- సరిగానే తింటున్నా విపరీతంగా బరువు తగ్గడం, నిద్ర పట్టకపోవడం, చేతులు వణకడం, మానసిక ఒత్తిడి చల్లగా ఉన్న వేళల్లోనూ వేడిగా అనిపించడం, ఎక్కువగా చెమటలు పట్టడం, నెలసరి క్రమం తప్పడం ఎక్కువసార్లు మలవిసర్జనకు వెళ్లాల్సి రావడం ఈలక్షణాలు హైపర్ థైరాయిడిజంగా పరిగణించాలి.

మగవారిలో ఒకరికి వస్తే..

పురుషుల్లో కంటే మహిళల్లో అధికంగా కనిపించే హైపర్ థైరాయిడిజం మగవారిలో ఒక్కరికి వస్తే ఆడవారిలో ఏడు మందికి వచ్చే అవకాశాలున్నాయి. మహిళల్లో దాదాపు 4రెట్లు థైరాయిడ్ ఎక్కువగా వస్తుంది. థైరాయిడ్ సమస్యలతో బాధపడే గర్భిణులు జాగ్రత్తగా ఉండటం ఎంతో అవసరం. హైపోథైరాయిడిజం, థైరాక్సిన్ హార్మోన్ లోపిస్తే గర్భస్రావం అయ్యే ముప్పు ఎక్కువ. మన దేశంలో గర్భిణుల్లో హైపో థైరాయిడిజం సమస్యలు అధికంగా ఉండటం వల్ల ప్రతి గర్భిణీ తప్పకుండా థైరాయిడ్ పరీక్ష చేసుకోవాలి.

హార్మోన్ల అసమతుల్యత వల్ల..

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ విభాగానికి హార్మోన్ల అసమతుల్యత వల్ల థైరాయిడ్ సమస్యలతో రోగులు వస్తుంటారు. ఎండోక్రైనాలజీ విభాగంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఓపీ ఉంటుంది. ఈ విభాగానికి 700 మంది రోగులు వస్తుండగా.. ఇందులో థైరాయిడ్ రోగులు 200 మంది వస్తుంటారు. మిగిలిన విభాగాల్లో మరో 200మంది థైరాయిడ్‌తో చికిత్స పొందుతుంటారు. మొత్తం థైరా యిడ్ రోగుల్లో 70 శాతం మందికి హైపోథైరాయిడ్, 30శాతం మందికి హైపర్ థైరాయిడ్ బాధితులు ఉంటున్నారు. ఎండోక్రైనాలజీ విభాగంలో థైరాయిడ్ సమస్యకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులకు థైరాయిడ్ పరీక్షలు తప్పనిసరిగా చేస్తున్నారు.

పరీక్షలు తప్పనిసరి



థైరాయిడ్ రావడానికి శరీరంలోని హార్మోన్ స్థాయిలో తేడాలే కారణం. కర్నూలు జీజీహెచ్‌కు ఎండోక్రైనాలజీ విభాగానికి వారానికి 200 మంది థైరాయిడ్ బాధితులు వస్తుంటారు. ఎండోక్రైనాలజీ డిపార్టుమెంటుతో పాటు గైనిక్, సర్జరీ, మెడిసిన్ వార్డులకు కూడా రోగులు వస్తుంటారు. థైరాయిడ్ జబ్బులున్న వారు తప్ప కుండా పరీక్షలు చేయించుకొని రెగ్యులర్‌గా మందులు వాడాలి.

- డా.పి.శ్రీనివాసులు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, ఎండోక్రైనాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

థైరాయిడ్‌ను అదుపులో ఉంచుకోవాలి



థైరాయిడ్‌ను అదుపులో ఉంచుకోవాలి. కనీసం ఆరు నెలలకొకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలి. వైద్యులు సూచించిన ప్రకారం రెగ్యులర్‌గా మందులు వాడాలి. జీవనశైలి మార్పులతో వ్యాధిని నియంత్రించవచ్చు. ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా చూసుకోవడం కొంత వరకు థైరాయిడ్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

- డా.బి.భరత్, ఎండోక్రైనాలజిస్టు, కర్నూలు

మహిళల్లో ఎక్కువ



పురుషుల కన్నా మహిళల్లో థైరాయిడ్ వచ్చే అవకాశం ఎక్కువ. థైరాయిడ్ గ్రంథిలో కణితులు 1 సెంటీమీటర్ కన్నా ఎక్కువగా ఉంటే ఆపరేషన్ నిర్వహిస్తారు. మగవారిలో థైరాయిడ్ గడ్డలు ఉంటే ఎక్కువ శాతం క్యాన్సర్ గడ్డలు వచ్చే ప్రమాదం ఉంది. కణితి వున్న వారికి ఆపరేషన్ అవసరం లేదు.

- డా.భార్గవ వ్యాస్, జనరల్ సర్జన్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

మహానాడుకు వేలాదిగా తరలిరండి

- జిల్లా సత్తా చాటుదాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): మహానాడుకు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడుకు జిల్లా నుంచి 5వేల మంది నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మహానాడు వేదికలో కర్నూలు జిల్లాలో చంద్రబాబు నాయకత్వ బలాన్ని నిరూపించే దిశగా అందరూ తరలిరావాలని పేర్కొన్నారు. నియోజకవర్గాల్లో, జిల్లాలో జరిగిన మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

జగన్‌కు జైలు తప్పదు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజాధనాన్ని దోచిన ఆర్థిక నేరగాడు జగన్‌కు జైలు తప్పదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.44 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచిన నేరంలో కేసుల్లో బెయిల్‌పై బయట ఉన్న జగన్మోహన్‌రెడ్డికి పదేళ్ల పాటు జైలులో చిప్పకూడు తప్పదని అన్నారు. ఈడీ, ఆటాచ్ చేయగా జైలకు వెళ్లి వచ్చాక ఆయన కల్లబొల్లి మాటలకు ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. ఆదే ఓటర్లు 2024 ఎన్నికల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని అన్నారు.

విద్యుదాఘాతంలో యవకుడు మృతి

గోనెగండ్ల, మే 24(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం చిన్నమరివీడు గ్రామంలో కరెంట్ బల్బు అమర్చుతూ ప్రమాదవశాత్తు ఇంటి యజమాని రవి(26) విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ శనివారం తెలిపాడు. గ్రామానికి చెందిన రవి కొత్తగా ఇల్లు కట్టుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి పైకప్పు వేశారు. కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో విద్యుత్ బల్బు ఏర్పాటు చేయడానికి వెళ్లినప్పుడు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ రవి కాలికి, చేతికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై రవి అక్కడి కక్కడే మృతి చెందాడు. రవి భార్య రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాగవైష్ణవిజయం

- పోరాడి గెలచిన పేదింటి సరస్వతీ పుత్రిక
- గణితంలో రీవెరిఫికేషన్
- ఏకంగా పెరిగిన 15 మార్కులు
- అవుకు మండల టాపర్‌గా నాగవైష్ణవి
- అభినందించిన ఉపాధ్యాయులు



రీవెరిఫికేషన్‌లో పెరిగిన మార్కుల పత్రాన్ని చూపుతున్న విద్యార్థిని నాగవైష్ణవి

అవుకు, మే 24 (ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువ వచ్చాయని ఆమె బాధ పడలేదు.. పిరికి చర్యలు చేపట్టలేదు.. మనోధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగింది.. రీవెరిఫికేషన్‌కు సిద్ధమైంది.. అందులో భాగంగా గణితం రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసి ఏకంగా 15 మార్కులను పొందింది. అవుకు మండల టాపర్‌గా సరస్వతీ పుత్రిక నాగవైష్ణవి నిలిచింది.

నాడు 569 మార్కులు.. నేడు 584..

నాగవైష్ణవి పేద కుటుంబంలో జన్మించింది. తండ్రి లారీ డ్రైవర్‌గా, తల్లి కూలీ పనులకు వెళుతున్నా కూతురికి చదువుపై ఉన్న ఆసక్తితో కష్టపడి చదివించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేకుండా నాగవైష్ణవి క్రమశిక్షణతో చదివింది. ఏప్రిల్ నెల 23న వెలువడిన ఫలితాల్లో 569 మార్కులొచ్చాయి. దీంతో పాఠశాల ఫస్టకే పరి మితమైంది. మండల టాపర్‌గా రావలసి ఉన్న అవకాశాన్ని కోల్పోయింది. గణితంలో మంచిపట్టు ఉన్నప్పటికీ 84మార్కులు రావటంతో ఖంగుతింది. రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈనెల 23వ తేదీ రాత్రి వెలువడిన రీవెరిఫికేషన్ ఫలితాల్లో గణతం సబ్జెక్టులో ఏకాంగా 15 మార్కులు పెరిగి 99 మార్కులు వచ్చాయి. మొత్తం 584 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల నుంచి మండల టాపర్‌గా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరీ ధ్రువీకరించారు. ప్రభుత్వం విడుదల చేసిన పెరిగిన మార్కుల ధ్రువీకరణ పత్రాన్ని విద్యార్థిని నాగవైష్ణవికి అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, లీలాభారతి, సుమలత, మంజుల, రాధిక, సుబ్బలక్ష్మి, లత, విజయకుమారి, బాస్కర్ విద్యార్థినిని అభినందించారు.

హైకోర్టు బెంచ్ ఎందుకు పెట్టలేదు?

- రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి



సమావేశంలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

కర్నూలు కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఇంతవరకూ ఎందుకు ఏర్పాటు చేయలేదని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కవులు, కార్టూనిస్టులు, పాత్రికేయులు ఏమి రాసినా సహించలేని లక్షణం పెరిగిపోతోందని, అది ఆమోదించలేని పరిణామమని అన్నారు. భావ ప్రకటన, విమర్శనాత్మక స్వచ్ఛ మీద దాడి ఆందోళన కలిగించే విషయమన్నారు. కర్నూలులో కవి వెంకటేశ్వర్లు కవిత రాస్తే పోలీసులు నిర్బంధించడం సరికాదన్నారు. కర్నూలుకు ప్రకటించిన న్యాయ విశ్వ విద్యాలయం వేరేచోట పెట్టాలని నిర్ణయించారని, ఇలా ఈ ప్రాంతంపై నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. దీన్నివల్ల ప్రాంతీయ అసమానతలు ఏర్పడతాయన్నారు. గతంలో జరిగిన రాయలసీమ ఉద్యమం గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. బనకచర్ల ప్రైవేటు ప్రాజెక్టు అనడం ఏమిటని, విద్య, వైద్యం, రోడ్లు ఇలా అన్నీ ప్రైవేటీకరణ చేసి ఇప్పుడు ప్రాజెక్టులు కూడా ప్రైవేటీకరణ చేస్తే ఏమవుందని ప్రశ్నించారు. కడపలో ఉన్న ఏపీజీబీ అమరావతికి తీసుకెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ అంశాలపై సాహితీ స్రవంతి కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్మరణీయుల జాబితాను సవరించాలని, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, గిడుగు రామ్మూర్తి పేర్లను ఆ జాబితాలో చేర్చాలని రాష్ట్రంలో ఆంగ్ల మాధ్యమం ఎవరూ వద్దనడం లేదని, తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రంగస్థల కళలు, షార్ట్‌ఫిలిమ్స్‌లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడిటోరియాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బొలెరో వాహనాన్ని ఢీకొన్న లారీ

ఆదోని రూరల్, మే 24 ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం ఇస్వీ ప్రధాన రహదారిలో బొలెరో వాహనాన్ని లారీ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకొంది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు తగిలాయి. బళ్లారి జిల్లా మోకా తాలుక ఎరంగలి గ్రామానికి చెందిన రుద్రప్ప తన కుటుంబ సభ్యులు దాదాపు 15మందితో కలిసి కె.ఈ 46 ఎమ్ 1899 గల బోలేరా వాహనంలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం శనివారం బయల్దేరారు. వీరి వాహనం ఇస్వీ సమీపానికి రాగానే కోవెలకుంట్లకు చెందిన లారీ ఢీకొనడంతో రుద్రప్ప, స్థానిక హంపమ్మతోపాటు మరోకరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఏరియాసుపత్రికి తరలించారు. ఇస్వీ పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

నేడు హెల్త్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో మాత్రమే హెల్త్ అసిస్టెంట్ల(మేల్) కౌన్సెలింగ్ జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ శనివారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో వెక్టార్ బర్న్ డిసీజ్ కింద (ఎన్‌వైబీడీసీపీ) డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణకు హెల్త్ అసిస్టెంట్ల సేవలను వినియోగించనున్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో కౌన్సెలింగ్ పూర్తి కావడంతో కర్నూలు జిల్లాలో మాత్రమే కౌన్సెలింగ్ పూర్తిచేసి మధ్యాహ్నం 12 గంటలలోపు వివరాలను పంపాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఫోన్‌లో ఆదేశించినట్లు తెలిపారు. డేట్ ఆఫ్ జాయినింగ్ ప్రకారమే ఈ నిర్వహించాలని సూచించారు.

చిన్నారిపై అత్యాచారం హేయం

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



చిన్నారి మృతదేహంపై పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే


చాగలమర్రి, మే 24 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఓ చిన్నారి అత్యాచారానికి గురికావడం బాధాకరమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం జరిగిన ఈ ఘటనలో వివరాలు తెలుసుకోవడానికి ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని చిన్నారి మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, సమాజంలో ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడే వ్యక్తులకు ఉరితీయాలని అన్నారు. ఈ విషయం గురించి అసెంబ్లీలో కూడా చర్చిస్తామని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిందితుడిని కఠినంగా శిక్షించేలా చూస్తామని అన్నారు.

టోల్‌గేట్ సిబ్బందిపై దాడి

మహానంది, మే 24 (ఆంధ్రజ్యోతి): టోల్‌గేట్ రుసుం అడిగినందుకు సిబ్బందిపై దాడిచేసి గాయపర్చిన సంఘటన శుక్రవారం మహానందిలో చోటుచేసుకొంది. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. మహానంది దేవస్థానంకు చెందిన టోల్‌గేట్ల నిర్వహణను కాంట్రాక్ట్ పద్ధతిలో బహిరంగ వేలంలో ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అక్కడ కాంట్రాక్టర్ ఏర్పాటు చేసుకొన్న శ్రీనివాసగౌడ్ అనే సిబ్బంది నంద్యాల నుంచి మహానందికి వస్తున్న కారును ఆపి టోల్‌గేట్ రుసుం చెల్లించాలని అడిగారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కారు డ్రైవర్ నేనెవరో నీకు తెలియదా? నన్నే టోల్‌గేట్ చెల్లించాలని అడుగుతావా? అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇంతటితో ఆగకుండా శ్రీనివాసగౌడ్‌పై కారు డ్రైవర్ దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. దీనిపై గాయపడ్డ సిబ్బంది శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఇదిలా ఉండగా కారులో ఇటీవల నంద్యాల జిల్లాలోని ఒక పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ సస్పెండ్ అయిన ఎస్ఐ ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఆయన అండతోనే కారు డ్రైవర్ రెచ్చి పోయి టోల్‌గేట్ సిబ్బందిపై దాడికి ప్రయత్నించి గాయపర్చినట్లు తెలిసింది. ఈ వ్యవహారం నంద్యాల జిల్లా వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది.

పత్తి ఓబులయ్యకు 'ఎన్టీఆర్ పురస్కారం'

నేడు పల్నాడు జిల్లా సాతులూరులో ప్రదానం



కర్నూలు కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్యకు 'ఎన్టీఆర్ పురస్కారం' లభించింది. నటరత్న ఎన్టీఆర్ జాతీయస్థాయి నాటక పోటీల సందర్భంగా ఈ పురస్కారం అందజేస్తున్నట్లు కన్వీనర్ నడింపల్లి నరసింహారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు పల్నాడు జిల్లా సాతు లూరులో జరుగుతున్న 'ఎన్టీఆర్ జాతీయ స్థాయి నాటక పోటీల సందర్భంగా పత్తి ఓబులయ్యకు ఎన్టీఆర్ పురస్కారం అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావు పేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పత్తి ఓబులయ్యకు ఎన్టీఆర్ పురస్కారం లభించడంపై జిల్లాలోని వివిధ కళాసంస్థల ప్రతినిధులు, సాహిత్య సంస్థల నిర్వాహకులు హర్షం వ్యక్తంచేశారు.

అప్పుల బాధతో మహిళా రైతు బలవన్మరణం

సంజామల, మే 24: అప్పుల బాధతో ఓ మహిళా రైతు విషద్రావణం తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఆకుమళ్లలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన ఒంగూరు స్వప్న(41) భర్త పుల్లారెడ్డి గతేడాది మృతిచెందాడు. ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేది. అప్పులు ఎక్కువ కావడంతో తనకున్న ఆరు ఎకరాలను గత ఏడాది అమ్మేసింది. మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుంది. అందులో మిరప, మొక్కజొన్న పంటలు సాగుచేసి నష్టాల పాలైంది. అప్పులు ఎలా తీర్చాలో మదనపడేది. ఏమిచేయాలో తెలియక శుక్రవారం రాత్రి ఆమె విషద్రావణం తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యులు గమనించి కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు తరుణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ దుకాణాల నుంచే సరుకుల పంపిణీ

- డీఎస్‌వో రాజా రఘువీర్

కర్నూలు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల నుంచే సరుకుల పంపిణీ జరుగుతుందని కర్నూలు డీఎస్‌వో రాజారఘువీర్ తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు పొందవచ్చని ఆయన కార్డుదారులకు సూచించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు పని చేస్తాయన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారు, విభిన్న ప్రతిభావంతులు వారికి సరుకులు డోర్ డెలివరీ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

మోహన్‌ప్రసాద్‌కు డాక్టరేట్

హంద్రీనీవా నదిపై పరిశోధన



కర్నూలు అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జియోస్పెషియల్ సాంకేతికలతో హంద్రీ నది పరివాహక ప్రాంతంపై పరిశోధనకు డాక్టరేట్ మోహన్‌ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం(ఎస్వీయూ) తిరుపతి భూగర్భశాస్త్రం విభాగంలో ప్రొఫెసర్ టి.మధు పర్యవేక్షణలో ఇంటిగ్రేటెడ్ హైడ్రోజియోలాజిక్ స్టడీస్ ఆఫ్ హంద్రీ రివర్ బేసిన్ యూజింగ్ జియోస్పేషిల్ టెక్నిక్స్ ఇండియాలో ఈ అధ్యయనం పూర్తిచేశారు. కర్నూలు జిల్లాలోని హంద్రీ నదిపరివాహక ప్రాంతంలోని భూభౌతిక లక్షణాలను, భూగర్భ జలవనరులను గుర్తించేందుకు జియోస్పెషియల్ టెక్నాలజీలను సమర్థవంతంగా వినియోగించారు. డాక్టరేట్ ప్రదానంపై డాక్టర్ బి.రాజమాణిక్యం, పరీక్షల నియంత్రణాధికారి అధికారికంగా ఉత్తర్వులు జారీచేశారు.

పట్టణ సమస్యలను పరిష్కరించండి

ఆదోని టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో చాలా కాలంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న సమస్యలను సీపీఎం నాయకులు కొత్తగా బాధ్యతలు చేపట్టిన మునిసిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరీను శనివారం కలిసి కోరారు. సీపీఎం కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాల్ మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా మరో ఎస్ఎస్ ట్యాంకును ఏర్పాటు చేయాలని అన్నారు. శిథిలావస్థకు చేరుకున్న పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై తరుచూ జరుగుతున్న ప్రమాదాల కారణంగా కొత్త ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పేషంట్లకు అవసరమైన సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్ ప్రభుత్వ ఖర్చులతోనే తీసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత బస్టాండ్ స్థలంలో అర్థాంతరంగా ఆగిపోయిన కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, వెంకటేషులు, వీరేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

క్రిష్ణగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమకతాడు గ్రామానికి చెందిన మానుకింది అనసూయమ్మ(42)ఉపాధి పనులు చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందింది. రోజు మాదిరిగా శుక్రవారం ఉపాధి పనులకు వెళ్ళి పనులు చేస్తుండగా ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురైంది గమనించిన తోటి కూలీలు, కుటుంబ సభ్యులు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా కోలుకోలేక రాత్రి మృతి చెందింది. తెలుగు దేశం పార్టీ నాయకులు అమకతాడు వీరబధ్రుడు, వెంకటేష్, సుధాకర్,ఉపాధి ఈసీ మధు,టీఏ ఉశ్శేన్,ఫీల్డ్ అసిస్టెంట్ శీను మృతురాలి కుటుంబాన్ని పరమార్శించి నివాళిఅర్పించారు.

డీఐజీకి జన్మదిన శుభాకాంక్షలు

వెల్దుర్తి, మే 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కు టీడీపీ జిల్లా నాయకుడు బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం కర్నూలులో బి.క్యాంపులో ఉన్న డీఐజీ కార్యాలయంలో డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మహానాడును పండగలా జరుపుదాం

- ఆలూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు పూల నాగరాజు

ఆలూరు, మే24(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడు సభకు పెద్ద ఎత్తున ఆలూరు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆలూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు పూల నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం ఆలూరు టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటిసారిగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం టీడీపీ పరిశీలకులు పూల నాగరాజును, వీరభద్రగౌడ్‌ను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏబీసీ డీసీ అధ్యక్షులు నగరడోణ కిష్టప్ప, టీడీపీ మండల కన్వీనర్లు అశోక్, పరమారెడ్డి, తిప్పయ్య, నాయకులు సాలిసాహెబ్, తిమ్మయ్య, రవియాదవ్, హంపయ్య, భీమలింగ, కృష్ణంనాయుడు, నరసప్ప, రాము, సర్పంచ్ మోహన్‌రాజ్, అంజి, వన్నూరువలి పాల్గొన్నారు.

● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన స్వగృహం వద్ద నిర్వహించిన మహానాడు కార్యక్రమంపై నిర్వహించిన పార్టీ ముఖ్య నేతల సమావేశానికి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పూల నాగరాజు హాజరయ్యారు. కడపలో ఈనెల 27 నుంచి సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి పెదద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ జయరాం, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, చిప్పగిరి, దేవనకొండ మండలాల కన్వీనర్లు షేక్షావలి, విజయభాస్కర్, టీడీపీ నాయకులు శేషగిరి, ఉచ్చీరప్ప, విష్ణువర్ధన్ రెడ్డి, శీనప్ప, కృష్ణయాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వేర్వేరుగా సమావేశాలు

మహానాడు సమావేశాలు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేశారు. పార్టీ పరిశీలకులు పూల నాగరాజు రెండు సమావేశాలకు హాజరయ్యారు. టీడీపీలో మరోసారి వర్గవిబేధాలు బహిర్గతమయ్యాయి.


టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, పార్టీ పరిశీలకులు నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

మహానాడుకు ఏర్పాట్లలో టీడీపీ నాయకులు

తుగ్గలి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి కడపలో జరిగే మహానాడు సభకు వచ్చే నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను చేస్తున్నామని రాష్ట్ర ట్రైబల్ సలహా మండలి మెంబర్ వెంకటపతి, రాష్ట్ర టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. మహానాడుకు పత్తికొండ నియోజకవర్గం నుంచి వచ్చే కార్యకర్తలు, నాయకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు శనివారం నాయకులు అక్కడకు వెళ్లి ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి, నరసింహ చౌదరి, హరినాథ్‌గౌడు, తదితరులు ఉన్నారు.

వెంకటపతి ఎంపికపై హర్షం

తుగ్గలి, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ట్రైబల్ సలహా మండలి సభ్యుడిగా వెంకటపతి ఎంపిక కావడం హర్షణీయమని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని చెన్నంపల్లి, రామలింగాయపల్లె, కేపీ గుడిసెల్లో రాష్ట్ర ట్రైబల్ సలహా మండలి మెంబర్ వెంకటపతికి గ్రామాల్లో శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగమ్మ, పంచాయతీ సలహాదారుడు దేవేంద్ర, టీడీపీ నాయకులు మాబాషా, గోపాల్ రెడ్డి, బత్తిన దేవేంద్ర, రాజేంద్ర గౌడు, అక్బర్ బాషా, హుశేన్, రామయ్య, గిరి గిట్ల బలరాముడు, మల్లికార్జున తదితరులు ఉన్నారు.


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

● పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదరించి మంచి పదవులు ఇస్తారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. శనివారం తుగ్గలిలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడుతూ చెన్నంపల్లి పంచాయతీ సర్పంచ్‌గా రెండుసార్లు ఎన్నికైన వెంకటపతి సేవలను గుర్తించి పదవిని ఇవ్వడం ఎంతో సంతోషకరమని అన్నారు.

టీడీపీ నాయకుడు మృతి

పత్తికొండ, మే 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు సిరివాటి కందనాతి(68) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. పత్తికొండ ప్రాంతంలో బుడగ జంగాల నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. కుల సంఘంతో పాటు టీడీపీ అభివృద్ధికి ఆయన పనిచేస్తున్నారు. వార్డు మెంబరుగా పనిచేశాడు. ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. టీడీపీ నాయకులు


కందనాతి(ఫైల్)

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

- డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్

ఆదోని రూరల్, మే 24 ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని అందరూ కలిసి విజయవంతం చేద్దామని డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎంపీపీ భవన్‌లో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా డే సందర్భంగా రాష్ట్రానికి ప్రధానమంత్రి మోదీ రానున్నారని, కావున రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం గ్రామ గ్రామాన యోగా డేను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ శివరాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ మధుకృష్ణాచారి, ఈఓపిఆర్‌డీ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలి

పత్తికొండ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దస్తగిరి, నాయకులు నర్సన్న, బొజ్జులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఈశ్వర్ రెడ్డి భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం రవిచంద్రకుమార్ అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ ఎనిమిది వారాలైనా వేతనాలు ఇవ్వలేదన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పత్తికొండ మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొజ్జులు, ఉపాధ్యక్షులుగా శిఖామణి, కార్యదర్శిగా నరసన్న సహాయ కార్యదర్శిగా సుకప్పతో పాటు పలువురు కమిటి సభ్యులను ఎన్నుకున్నారు.

వినియోగదారులను మోసగిస్తే చర్యలు తప్పవు

● డీఎస్‌వో రఘువీర్

ఆదోని అగ్రికల్చర్, మే 24(ఆంధ్రజ్యోతి) : వినియోగదారులను మోసగిస్తే చర్యలు తప్పవని డీఎస్‌వో రాజారఘువీర్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్‌రావు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డ్, రైతు బజార్, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి, పెట్రోల్ బంక్ వాటర్ ప్లాంట్లను కలెక్టర్ ఏర్పాటు చేసిన జిల్లా వినయోగదారుల రక్షణ మండల ప్రత్యేక టీం అధికారి రాజా రఘువీర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. రైతు బజార్లో అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తున్న ముగ్గురిపై, వాటర్ ప్యాకెట్లు తయారు చేస్తున్న నిర్వాహకులపై, మౌలిక వసతులు కల్పించని పెట్రోల్ బంకు యాజమాన్యంపై, ఆసుపత్రికి రోగులకు సరైన భోజనం వడ్డించని కాంట్రాక్టర్‌పై కేసులు నమోదు చేశారు. తూకాల్లోనూ ధరల్లోను వినియోగదారులు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా తూనికల కొలతల శాఖ అశ్విన్ కంట్రోలర్ రాముడు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సత్యవతి, జిల్లా వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ క్రైక, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్, జిల్లా వినియోగదారుల రక్షణ మండల సభ్యుడు ఈశాభాషా, శివరామి రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వాలి భాషా పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పత్తికొండ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పార్టీ శ్రేణులపైనే ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు యాదవ్ అన్నారు. శనివారం స్థానిక శారద వృద్ధాశ్రమంలో బీజేపీ అసెంబ్లీ శాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, జల్‌జీవన్ యోజన, ఆవాస్ యోజన వంటి పథకాలు పేదవారికి అందేలా చూడాలని కోరారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర గోవర్దన్ నాయుడు, మండల అధ్యక్షుడు కరణం నరేష్, కిసాన్ మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జి సీసీ రంగన్న, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, హస్త కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు రామ్మోహన్, నాయకులు కూనా మల్లికార్జున, దండి మల్లికార్జున, గోరంట్లప్ప తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో బాలలను సంరక్షిద్దాం

పత్తికొండ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలలను అందరి సహకారంతో సంరక్షిద్దామని పత్తికొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి జ్యోష్ణదేవి అన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు నందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మిస్సింగ్ చిల్డ్రన్స్‌డే నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. బాలల హక్కులను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వారికి అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. ప్రధానంగా పోలీస్, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, న్యాయ సేవాధికార సంస్థ అధికారులు, స్వచ్ఛంద సంస్థల వాటి ద్వారా బాలలను సంరక్షించి వారి హక్కులను కాపాడి తోడ్పాటు అందిద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ జయన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుమిత్ర, త్రివేణి, ఎంఈవో రమేష్; యువ స్పందన సొసైటీ సెక్రటరీ నాగరాజు, న్యాయవాదులు సిరాజ్, నరసింహయ్య ఆచారి, రంగస్వామి, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

దేవనకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి) : స్టాకు లేని రేషన్ దుకాణాలను పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ తనిఖీ చేశారు. దేవనకొండలోని 16, 17, 19, కరివేములలోని 9వ దుకాణాలను తనీకి చేశారు. బోర్డు మరియు దుకాణానికి సంబంధించిన వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. జూన్ 1 లోగా దుకాణాలకు రేషన్ సరుకుల వస్తాయని, 1 నుంచి 15వ తేదీ వరకు ప్రజలు దుకాణాలలో రేషన్ సరుకులు తీసుకొవచ్చారన్నారు.ఆయన వెంట వీఆర్వోలు దాదావలి, రాజన్న, ఆనందు, తదితరులు ఉన్నారు.

ఉసురు తీస్తున్న ఈత సరదా

- మూడేళ్లలో 10మంది మృత్యువాత
- ఈనెల 23న ఇద్దరు మృత్యువాత
- తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి

గోనెగండ్ల, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది వేసవిలో చిన్నపిల్లలు ఈతకు వెళ్లడం అక్కడ ప్రమాదవశాత్తు నీటి కుంటల్లో మునిగి మృతి చెందడం జరుగుతోంది. పొలాల్లో ఉన్న నీటి కుంటలు పిల్లలకు మృత్యు కుంటలుగా మారాయి. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో బోయ మాధురి, బోయ మంజుల అనే ఇద్దరు బాలికలు ఈతకువెళ్లి నీటి మునిగి మృతిచెందారు. ప్రతి ఏడాది గోనెగండ్లలో వేసవి కాలంలో పిల్లలు ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. 15 రోజులు క్రితం రాళ్లదొడ్డికి చెందిన శ్రీను(14), నందవరం మండలం, సంజీవపురం గ్రామానికి చెందిన అనుక్ (13) ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతిచెందారు. పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్త వహిస్తే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడవచ్చు. వేసవి కాలం వచ్చిందంటే పిల్లలు సరదాగా నీటి కుంటలు, కాలువలు, బావుల్లో ఈతకు వెలుతుంటారు. ఇక వారి సరదానే సరద, ఈతకు వెళ్లేప్పుడు మాత్రం తల్లిదండ్రులు కొంత జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. బావులు, కుంటలు, చెరువుల్లో ఈతకు వెళ్లే ముందు పిల్లలపై తల్లిదండ్రులు ఒకటికి రెండు మార్లు ఆలోచించి పంపాల్సి ఉంటుంది. ఈత అడే సమయంలో వారి అనందానికి హద్దు ఉండదు, బావి గట్టు మీద నుంచి దూకడం వల్ల బావిలోని పూడికలో కూరుకొని పోయే ప్రమాదం ఉంది. చెరువులు, కుంటల పరిస్థితి కూడా ఇంతే. ప్రతి ఏడాది గోనెగండ్ల మండలంలో ఈత ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. 2024 ఏప్రిల్ నెలలో మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎల్లెల్సీ కాలువలో ఈతకు వెళ్లిన అరుణ్‌కుమార్ అనే ఆరేళ్ల పిల్లోడు నీట మునిగి మృతి చెందాడు. అలాగే ఆదోనికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు విహారయాత్ర కోసం గాజులదిన్నె ప్రాజెక్టుకు వచ్చి ఇద్దరు విద్యార్థులు మృత్యువాతపడ్డారు. 2023లో ఐరన్‌బండ గ్రామానికి చెందిన 7వ తరగతి చదువుతున్న బాషా అనే విద్యార్థి ఎల్లెల్సీ కాలువలో ఈత కు వెళ్లి మృత్యువాత పడ్డాడు. మూడేళ్ల క్రితం గోనెగండ్ల మండలం నెరుడుప్ప గ్రామానికి చెందిన మల్లికార్జున, ప్రకాష్ అనే ఇద్దరు విద్యార్థులు ఈతకు వెళ్లి గాజులదిన్నె ప్రాజెక్టులో గుంతలో పడి మృతి చెందారు. ఇలాంటి సంఘటనలు మండలంలో ప్రతి ఏడాది జరుగుతూనే ఉన్నాయి. ఆరేళ్లలో దాదాపు 10 మంది పైగానే ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారని సమాచారం.


గోనెగండ్ల సమీపంలో నీటి ట్యాంక్‌లో ఈత కొడుతున్న పిల్లలు


ప్రమాదకరంగా ఉన్న నీటి కుంట

ఈతలో ప్రమాదాలు

సెలవుల్లో పిల్లలు చెరువులు, కాలువలు, బావుల్లో ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతారు. ఉపాధి పనుల్లో భాగంగా గుంతలు లోతుగా తవ్వేస్తున్నారు. దీనిపై చిన్నపిల్లలకు అవగాహన ఉండదు. ఈ గోతులు ప్రమాదానికి నిలయాలు, చెరువు గట్లపై నుంచి నీటిలోకి దూకడం.. ఒకరిని చూసి మరోకరు ఈత పోటీలకు ప్రయత్నించి ప్రమాదంలో పడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రయత్నించాలి. చిన్నారులను బయటకు పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఖాళీ సమయంలో నిత్యం చదివే పుస్తకాలతో పాటు విజ్ఞానదాయకమైన పుస్తకాలను అందించాలి. ఈత సరదా, షికార్లు, ఎండల్లో ఆటలను నిలువరించాలి. చిన్నారుల దృష్టిని వేరే వ్యాపకా లపైకి మళ్లించాలి. ఇంటిదగ్గర చదరంగం, క్యారమ్స్ తదితర ఆటలు ఆడే విధంగా చర్యలు తీసుకోవాలి.

పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



వేసవి కాలం, ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలకు సెలవులు కావునా ఇండ్ల దగ్గర తమ పిల్లలపై తల్లిదం డ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఈత రాని చిన్నారులను చెరువులు, కుంట లు, బావుల దగ్గరకి పోనివ్వరాదు. ఇంటి పట్టునే ఉండే విధంగా చూసుకోవాలి.

-నీలకంత, ఎంఈవో గోనెగండ్ల

అమెరికా కార్నల్ యునివర్సిటీలో మెరిసిన పెద్దకడుబూరు విద్యార్థిని


తేజస్విని

ఎమ్మిగనూరు , మే 24 **(ఆంధ్రజ్యోతి):** అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న కార్నెల్ యునివర్సిటీలో పెద్దకడుబూరుకు మండల కేంద్రానికి చెందిన నాగమ్మగారి తేజస్విని కర్నూలు జిల్లాలోనే ఏ ఐవి వై లీగ్‌లో ఎంపీహెచ్ పూర్తిచేసిన ప్రథమ విద్యార్థినిగా నిలిచింది. తేజస్విని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దక డుబూరుకు చెందిన రాంమోహన్‌రెడ్డి కూతురు నాగమ్మగారి తేజస్విని ప్రాథమిక విద్యాభ్యాసం స్వంత గ్రామంలోనే పూర్తి చేసింది. పదో తరగతి వైజాగ్‌లోని బాష్యంలో, ఇంటర్ గుంటూరులోని బాష్యం జూనియర్ కళాశాలలో పూర్తిచేసింది. ఎంబీబీఎస్ విజయనగరంలోని ఎంఐఎంఎస్ కళాశాలలో పూర్తి చేసింది. మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్ ను చదివేందుకు అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న కార్నెల్ యునివర్శిటిలో చేరింది. (2023-25) రెండేళ్లలో ఎంపీహెచ్‌ను ఒక ఐవీవై లీగ్‌లో పూర్తి చేసి కర్నూలు జిల్లాలో ప్రథమ విద్యార్థినిగా నిలిచింది. అమెరికాలోని కార్నెల్ యునివర్సిటీలో ఎంపీహెచ్ పూర్తిచేసి జిల్లాలోనే మొదటి విద్యార్థిని తేజస్విని కావటంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పండుగ వాతావరణంలో రేషన్ పంపిణీ


కోసిగిలో రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కోసిగి, మే 24 (ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీన రేషన్ దుకాణాల్లోనే నిత్యావసర సరుకులు అందజేయాలని తహసీల్దార్ రుద్రగౌడు అన్నారు. అందులో భాగంగానే శనివారం కోసిగిలోని పలు రేషన్ దుకాణాలను తహసీల్దార్ రుద్రగౌడు పరిశీలించి రేషన్ పంపిణీకి సిద్దం చేసుకోవాలని, కార్డుదారులకు రేషన్ అందించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని రేషన్ డీలర్లను సూచించారు. మండలంలోని 42 రేషన్‌షాపుల్లో డీలర్లు పండుగ వాతావరణం తలపించేలా రేషన్ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి, ఆర్ఐ శ్రీరాములు, జూనియర్ అసిస్టెంట్ పరుశురాం, రేషన్ డీలర్లు ఉన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి


ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

నందవరం, మే 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నిధులు అందక నిలిచిపోయిన గృహాలకు ఈ ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుందని, త్వరగా పెండింగ్‌లో ఉన్న గృహాలను పూర్తి చేసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో హౌసింగ్ పీడీ చిరంజీవి, డీఈ ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పుల్లయ్య, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు పర్యటించారు. గృహనిర్మాణాలను మధ్యలోనే నిలిపివేసిన లబ్దిదారులతో మాట్లాడారు. ఇళ్ల మంజూరైన లబ్ధిదారుడికి ప్రభుత్వ నిర్మాణం కోసం రూ. 1.80 లక్షలు మంజూరు అయ్యేవని, అయితే ఆ పాత బిల్లుతో పాటు ఆదనంగా బీసీ, ఎస్సీ లకు మరో రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేలు విడుదల చేస్తున్నట్లు హౌసింగ్ ఏఈ తెలిపారు. కావున లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఎమ్మిగనూరు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): రైతులకు 90శాతం సబ్సిడీతో విత్తనాలను అందజేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు డిమాండ్‌చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యిందని, తొలకరి జల్లులు కురిశాయని రైతులు పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కింద వేరుశనగ, పత్తి, గోధుమ, మొక్కజొన్న, వరి విత్తనాలను అందజేయాలన్నారు. సమావేశంలో వీరేష్, నరసింహులు, నాగరాజు, సుంకన్న, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ముందస్తు వర్షాలతో సాగుకు సన్నద్ధం


కోసిగిలో ఎద్దుల సాయంతో దున్నుతున్న రైతులు

కోసిగి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందస్తు వర్షాలు పడటంతో రైతన్నలు సాగుకు సన్నద్ధమయ్యారు. వారం రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు మే నెలలోనే ఆయా గ్రామాల్లోని రైతులు తమ పొలాలను సాగుకు సిద్ధం చేసుకుని విత్తనాలు విత్తుతూ బిజీ బిజీ అయ్యారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో ఉదయం నుంచే పొలంబాట పట్టి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పల్లెపాడు గ్రామంలోని రైతులు తమ పొలాల్లో సేంద్రియ ఎరువులను చల్లుతూ, మరి కొందరు రైతులు ఎద్దుల సహాయంతో పొలాలను దున్ని దుక్కు చేసుకుంటూ వేరుశనగ విత్తనాలు పొలాల్లో విత్తుతున్నారు. ఏదీ ఏమైనప్పటికీ ముందస్తు వర్షాలు పడటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

పట్టణంలో ఆకస్మిక తనిఖీలు


తిరుమల డెయిరీలో పాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఎమ్మిగనూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారుల బృందం శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది .ప్రధానంగా గాంధీనగర్‌లోని తిరుమల డెయిరీని, రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న యాపిల్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ను, గోనెగండ్ల చౌరస్తాలోని పెట్రోల్ బంక్‌ను అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని తిరుమల డెయిరీలో ప్రభుత్వం నుంచి వచ్చిన అనుమతులు, వారి దగ్గర ఉన్న స్టాక్‌ను, పాల నాణ్యతను పరిశీలించారు వీరికి ఫుడ్ లైసెన్స్ అనుమతి లేకపోవడంతో ఫూడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ నోటీసులు అందజేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న యాపిల్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లో ప్రభుత్వ అనుమతులు, ట్రేడ్ లైసెన్స్, ల్యాబ్‌కు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో యాపిల్ ల్యాబ్‌కు నోటిసులు అందజేస్తామన్నారు. గోనెగండ్ల సర్కిల్‌లోని పెట్రోల్ బంక్‌లో కూడా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఏవో రాజారఘువీర మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారుల రక్షణ మండలి కమిటీని ఏర్పాటు చేసిందని, ఇది కర్నూలు జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా మొదలుపెట్టామని చెప్పారు. ప్రజలు ఖర్చు చేసే ప్రతి రూపాయికి న్యాయం జరగాలని వినియోగదారుల హక్కులను కాపాడటానికి ఇది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీసీటీవో చక్రనాయక్, జిల్లా వినియోగదారుల సెక్రటరీ శివమోహన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సత్యవతి, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెథాలజీ శ్రీరాములు, అసిస్టెంట్ కమిషనర్ కైక, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, వినియోగదారుల పట్టణ ప్రెసిడెంట్ రహ్మతుల్లా పాల్గొన్నారు

బంగారు రథంపై ప్రహ్లాదరాయలు


బంగారు రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు రథంపై విహరించారు. శనివారం వైశాఖమాసం ద్వాదశి శుభదినంను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణరథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. శని, ఆదివారాలు సెలవు కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మంచాలమ్మకు విశేషాభిషేకం మంత్రాలయంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. శుక్రవారం వైశాఖ ద్వాదశి శుభదినాన్ని పురష్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీటీడీ తరహాలో క్యూలైన్లు

రోజురోజు పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా.. టీటీడీలో తరహాలో క్యూ కంపార్టుమెంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం ఈఈ, మేనేజర్ సురేష్ కోనాపూర్‌లు ఏర్పాట్లను పరిశీలించారు.

రీసర్వే పక్కాగా నిర్వహించాలి

మంత్రాలయం, మే 24 (ఆంధ్రజ్యోతి): భూములు రీసర్వే చేస్తున్న గ్రామాల్లో రైతులను సమన్వయం చేసుకుంటూ పక్కాగా కొలతలు సేకరించాలని తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో చెట్నహళ్లి, సుంకేశ్వరి గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే నిర్వహణపై సర్వేయర్లతో మాట్లాడారు. రీసర్వేలో రైతులు సాగు చేస్తున్న కొలతలను తీసుకుంటూ అన్నదమ్ముళ్ల బాగాలు, విక్రయాలు, ప్రభుత్వ భూములు వాగులు, వంకలు నిక్కచ్చిగా సర్వే చేయాలన్నారు. సర్వే అనంతరం విభేదాలు, తగాదాలు, కొలతల్లో తేడాలున్న రైతులతో మాట్లాడి వారి సహకారంతో సమస్యను పరిష్కరించాలన్నారు. రీసర్వేపై వీఆర్వోలు, సర్వేయర్లు నిర్లక్ష్యం వహించకుండా ముందుకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ అశోక్, డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్‌రావు, నవీన్ కుమార్, ఉరుకుందాచార్, కీర్తి, శేఖర్ నాయక్, భీరప్ప, వీఆర్వోలు భీముడు, ఆనంద్, ఆర్ఐ ఆదాం, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి పరిశీలన


ఆసుపత్రిలోని పరికరాలను పరిశీలిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుట్టా రేణుక శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పాధాన్యతనిచ్చిందన్నారు .రూ12.60 కోట్లతో 100 పడకల ఆసుపత్రికి మాజీ ఎమ్మెల్యే చేన్నకెశవరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించి నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాక ఎన్నికల కోడ్ రావడంతో జాప్యం జరిగిందన్నారు. వైద్యానికి అవసరమయ్యే పరికరాలు, మిషన్స్ కూడా అందుబాటులోకి రావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ, ప్రతుల్, నజీర్, నాగేషప్ప, కొమ్ము రాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

మంత్రాలయం, మే 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో డిష్ వైర్లను సరి చేస్తున్న నందవరం చెందిన రామకృష్ణ అనే వ్యక్తి విద్యుత్‌షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దేశాయ్ నెట్‌వర్క్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న రామకృష్ణ డిష్ మరమ్మతులు చేస్తుండగా.. షాక్ తగిలింది. దీంతో హుటాహుటిన మంత్రాలయంలోని శ్రీమఠం ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మిగనరు ఆసుపత్రిలో చేర్పించారు. వర్షం రావడంతో డిష్ రిపేరు చేస్తుండగా.. విద్యుత్ షాక్ తగిలిందని గ్రామస్థులు తెలుపుతున్నారు.

గడ్డివామి దగ్ధం

ఎమ్మిగనూరు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): గడ్డివామి దగ్ధమై రూ.30వేల ఆస్థినష్టం జరిగిన సంఘటన శనివారం మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పెద్ద ఉరుకుందు పశుల మేత కోసం గడ్డిని వామిగా పేర్చుకున్నాడు. సాయంత్రం వీచిన గాలులకు గడ్డివామిపై ఉన్న తీగలు ఒకటికొకటి రాసుకొని నిప్పు రవ్వలు చెలరేగాయి. నిప్పు రవ్వలు గడ్డివామిపై పడడంతో గడ్డివామికి నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేయడంతో అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అగ్నిమాపక సిబ్బంది సర్ధార్‌బాషా, మహబూబ్‌సాహెబ్, రమేష్, పరమేష్ పాల్గొన్నారు.

రేషన్ షాపుల ఆకస్మిక తనిఖీ


గోనెగండ్లలో రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్

గోనెగండ్ల, మే 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, గోనెగండ్ల, మండలాలోని రేషన్ షాపులను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎమ్మిగనూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలోని రేషన్‌షాప్‌లలో బియ్యం, చెక్కర ఇతర రేషన్ వస్తువుల నిల్వలను పరిశీలించారు. రికార్డులలో ఉన్న స్టాక్‌కు సరిపోయిందా లేదా అని తనిఖీ చేశారు. అలాగే స్థానికంగా ఉన్నరేషన్‌కార్డు దారులతో మాట్లాడారు. రేషన్ సక్రమంగా అందుతుందా లేదా, బియ్యం నాణ్యత ఎలా ఉంది?, డీలర్లు రేషన్‌కార్డుదారుల నుంచి అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్, మహేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

11వేల గృహాలు పూర్తి చేయాలి

గోనెగండ్ల, మే 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా హౌసింగ్ స్కీం కింద పెండింగ్ లో ఉన్న గృహాలను జూన్ 12వ తేది నాటికి 11,706 గృహలను పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి తెలిపారు. శనివారం గోనెగండ్లలోని హెచ్ కైరవాడి, చిన్ననేలటూరు, అలువాల, కులుమాల గ్రామాలలో హౌసింగ్ పీడీ చిరంజీవి, డీఈ ప్రసాద్, ఎంపీడీవో మణిమంజరి పర్యటించి, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న గృహాలను వెంటనే నిర్మించుకోవాలని కోరారు. అనంతరం పీడీ చిరంజీవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మండలం లోని ఏ గ్రామానికి ఎన్ని గృహాలు మంజూరు అయ్యాయి. అందులో ఎన్ని పూర్తి అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో, హౌసింగ్ ఏఈ షేక్షావలి, ఏపీఎం, ఏపీవో, వర్క్ఇన్‌స్పెక్టర్, పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కౌతాళం, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలను చేపట్టారు. ముఖ్యంగా బుడుములదొడ్డి, ఎరిగేరి పులిగట్టు, అగసలదిన్నె అంజనేయస్వామి దేవాలయాల్లో అర్చకులు తెల్లవారుజామునే మూలవిరాట్‌కు శుద్దజలాలచే ఫలపుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు చేపట్టారు. తరువాత దేవాలయంలో సీతారాములవారి విగ్రహాలను ప్రత్యేక రథంతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి పూజలు చేశారు.

18వ రోజుకు చేరిన సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు మరియు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. 18వ రోజు సమ్మె చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చెసుకుంటూ వెళ్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట కూర్చొని నిరసన తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

గోనెగండ్ల, మే 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవిలో మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు గాను చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గంజహళ్లి, బైలుప్పల, గ్రామాలలో హంద్రీ నది లో నీటి బోర్ల ద్వార గ్రామాలకు నీటి సరఫరా చేస్తాన్నారు. అలాగే గ్రామాలలో వేసిన బోర్లను మరమ్మతు చేయించడం ద్వార కూడా నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎమ్మిగనూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్‌బాషా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అక్రమ ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు ఎందుకు స్పందిం చడం లేదన్నారు. పరిస్థితి ఇలే కొనసాగితే విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేస్తామన్నారు. విష్ణు, ఖాదర్, దస్తగిరి, సమీ, హాజీ, బాబు, క్రాంతి, రాము, ఖాజా, మహబూబ్ పాల్గొన్నారు.